ప్రజాశక్తి
సోమవారం 26 జూన్ 2023 5
శ్రీ సత్యసాయి

పెనుకొండలో 'తెలుగు తమ్ముళ్ల' ఘర్షణ

ప్రజాశక్తి -పెనుకొండ

పెనుకొండ పట్టణంలో తెలుగు తమ్ముళ్లు రెండు వర్గాలుగా ఏర్పడి దాడులు చేసుకున్నారు. 'భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం పేరుతో ఆదివారం మధ్యాహ్నం తెలుగుదేశం పార్టీ నాయకులు బస్సు యాత్ర చేపట్టారు. పట్టణంలోని ఎన్‌టిఆర్ సర్కిల్ వద్ద నియోజకవర్గ ఇన్‌ఛార్జి బికె.పార్థసారథి, తెలుగుదేశం పార్టీ కార్య నిర్వాహక కార్యదర్శి సవితమ్మ వర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈసందర్భంగా ఒకరిపై ఒకరు దాడులకు దిగారు. దీంతో ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. వెంటనే అక్కడే వున్న పోలీసులు, టీడీపీ నాయకులు ఇరువర్గాలకు సర్దిచెప్పి పక్కకు పంపారు. దీంతో సమస్య సద్దుమణిగింది.

ఘర్షణ పడుతున్న తెలుగు తమ్ముళ్లు

నేతన్న నేస్తంలో 'రాజకీయం'

స్థానిక ప్రజా ప్రతినిధి ఒత్తిళ్లతో అధికారులు మౌనం
వెల్ఫేర్ అసిస్టెంట్ నిర్లక్ష్యం
గడువు ముగియడంతో నేత కార్మికులు లబోదిబో

'కులం చూడం, మతం చూడం, పార్టీలు చూడం, రాజకీయాలు చేయం, అర్హత ఉంటే చాలు ఎవరి ప్రమేయం ఎటువంటి సిఫారసులు లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు డబ్బు జమ చేస్తా'మని స్వయాన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పదేపదే చెప్పే మాటలు. అయితే క్షేత్రస్థాయిలో ముఖ్యమంత్రి మాటలను స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోలేదన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. అడ్డమైన నిబంధనలు విధిస్తూ రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడుతూ ప్రభుత్వానికి చెడ్డ పేరు తెస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అన్ని అర్హతలు ఉన్నప్పటికీ కొందరు స్థానిక ప్రజాప్రతినిధులు గ్రామాలలో అలజడి సృష్టించడానికి కుట్రలు పన్నుతున్నారన్న ఆరోపణలు వినపడుతున్నాయి. అర్హత కలిగిన లబ్ధిదారులను గుర్తించి వారికి పథకాలు అందజేయాల్సిన అధికారులే స్థానిక ప్రజాప్రతినిధి ఒత్తిళ్లకు తలొగ్గి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణాలు వ్యక్తం అవుతున్నాయి.

ప్రజాశక్తి కదిరి టౌన్

రెక్కాడితే గాని డొక్కాడని నేతకార్మికుల కష్టాలు వర్ణణాతీతం. అప్పుల ఊబిలోకి వెళుతున్న నేతకార్మికులను ఆదుకోవాలన్న సంకల్పంతో సీఎం జగన్మోహన్ రెడ్డి వైఎస్ఆర్ నేతన్న నేస్తం పథకాన్ని ప్రవేశపెట్టారు. సొంతం మగ్గం కలిగిన వారికి ప్రతి ఏటా 24 వేల రూపాయలు నేరుగా వారి ఖాతాలకు జమ చేస్తున్నారు. అయితే స్థానిక ప్రజాప్రతినిధి వ్యవహారశైలి పలువురు నేతకార్మికులకు నష్టం చేకూర్చుతోందన్న విమర్శలున్నాయి. మూడు సంవత్సరాలు వరుసగా అర్హత సాధించిన కార్మికులకు ఈ ఏడాది సొంత మగ్గం కలిగి ఉన్నప్పటికీ అర్హత జాబితాలో పేరు చేర్చేందుకు అధికారులు సచివాలయ సిబ్బంది వెనకడుగు వేస్తున్నారు. బాధిత నేతకార్మికులు పది రోజుల నుండి సచివాలయం, ఎంపీడీవో కార్యాలయాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగినా ఫలితం కన్పించడం లేదు. అన్ని అర్హతలు ఉన్నప్పటికీ నేతన్న నేస్తం అర్హత జాబితాలో ఎందుకు తమను చేర్చలేదని కార్మికులు ప్రశ్నిస్తే వెల్ఫేర్ అసిస్టెంట్ నిర్లక్ష్యమైన సమాధానం చెబుతూ అర్హత గడువు ముగిసేవరకు కాలయాపన చేస్తున్నారన్న ఆరోపణలు వినపడుతున్నాయి. 'ఎంపిటీసీ ఆదేశిస్తే అర్హత జాబితాలో చేరుస్తామని లేకుంటే లేద'ని వెల్ఫేర్ అసిస్టెంట్ తెగేసి చెబుతున్నారని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజుల క్రితం గడువు ముగియడంతో నేత కార్మికులు ఏం చేయాలో దిక్కుతోచక ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక ఆవేదన వ్యక్తం చేస్తున్న పరిస్థితి నెలకొంది. నల్లచెరువు మండలం కదిరిపులకుంట గ్రామానికి చెందిన జహీర్, శ్రీనివాసులు గత పది సంవత్సరాలుగా నేత కార్మికులుగా పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మగ్గం నేస్తేనే పూట గడవని కుటుంబాలు వారివి. ప్రభుత్వం నుండి ఆర్థికసాయం అందుతున్న ఆశతో ఉన్న వారికి స్థానిక ప్రజాప్రతినిధి, అధికారుల వ్యవహరించిన తీరుతో నిరాశ ఎదురైంది. అర్హత కలిగిన నేతకార్మికులకు ప్రభుత్వ సాయం అందే విధంగా అధికారులు చొరవ తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

వెల్ఫేర్ అసిస్టెంట్ నిర్లక్ష్యం : ప్రభుత్వం నుండి వేలాది రూపాయలు జీతభత్యాలు తీసుకుంటూ బాధ్యతగా విధులు నిర్వర్తించాల్సిన వెల్ఫేర్ అసిస్టెంట్ అధికార పార్టీ నాయకుల అడుగులకు మడుగులు వత్తుతూ వారు చెప్పిన వారికే ప్రాధాన్యతనిస్తూ అంతులేనీ నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్నారనికదిరి పూలకుంట గ్రామపంచాయతీ ప్రజలు ఆరోపిస్తున్నారు. అర్హత కలిగిన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందజేసి వారికి భరోసా ఇవ్వాల్సిన వెల్ఫేర్ అసిస్టెంట్ విధులు పట్ల నిర్లక్ష్యం వహిస్తూ రాజకీయాలు చేస్తున్నారని విమర్శిస్తున్నారు. బాధిత నేతకార్మికులు గత పది రోజులుగా వెల్ఫేర్ అసిస్టెంట్ చుట్టూ తిరుగుతున్న కనికరించలేదు. ఉద్దేశ పూర్వకంగా సెల్ స్విచ్ఆఫ్ చేసుకుంటూ నానా ఇబ్బందులు గురి చేశారని బాధితులు వాపోతున్నారు. సంబందిత అధికారులు వెల్ఫేర్ అసిస్టెంట్ తీరుపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

మితిమీరిన స్థానిక ప్రజాప్రతినిధి జోక్యం : ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన ప్రజా ప్రతినిధి తనకు అనుకూలమైన రాజకీయాలు చేస్తూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. తన ప్రమేయం లేకుండా పథకాలు వర్తింపజేస్తే చర్యలు తప్పవని సచివాలయ సిబ్బందిని హెచ్చరించినట్లు సమాచారం. దీంతో సచివాలయ సిబ్బంది లబ్ధిదారులు సచివాలయానికి వచ్చిన వారికి 'ఆ ప్రజాప్రతినిధి నుండి ఫోన్ చేయిస్తే పథకాలు వస్తాయని లేకుంటే రావ'ని కరాఖండిగా చెబుతున్నారని బాధితులు విమర్శిస్తున్నారు.

అర్హత ఉన్నా అన్యాయం చేస్తున్నారు

మూడు సంవత్సరాలుగా వరుసగా నేతన్న నేస్తం పథకం కింద డబ్బులు వచ్చాయి. అయితే ఈ ఏడాది ఎంపీటీసీ భాస్కర్ రెడ్డి తనకు నేతన్న నేస్తం రాకుండా అడ్డు తగులుతున్నాడు. రాజకీయ కక్షతోనే ఎంపీటీసీ ఈ విధంగా వ్యవహరిస్తున్నాడు. వెల్ఫేర్ అసిస్టెంట్ వద్దకు వెళితే ఎంపీటీసీ చెబితేనే నమోదు చేస్తానని లేకుంటే నేనేం చేయలేనని చెబుతున్నాడు.

జహీర్,
నేతకార్మికుడు నల్లచెరువు మండలం

స్థానిక ప్రజాప్రతినిధి ప్రోద్బలంతో అన్యాయం

స్థానిక ఎంపీటీసీ ప్రోద్బలంతో నాకు నేతన్ననేస్తం అందలేదు. అర్హత ఉన్నప్పటికీ నా పేరును నమోదు చేయలేదు. మూడు సంవత్సరాలుగా నేతన్న నేస్తం వస్తోంది. ఆసారిమాత్రం పేరు లేదు. పది రోజులుగా సచివాలయం చుట్టూ తిరుగుతున్న ప్రయోజనం కన్పించలేదు.

శ్రీనివాసులు,
నేతకార్మికుడు నల్లచెరువు మండలం

క్షౌర వృత్తిని మింగేస్తున్న 'కార్పొరేట్'

పొట్టగొట్టొద్దంటున్న వృత్తిదారులు
'అనంత'లో ఆదివారం దుకాణాలు బంద్ చేసి నిరసన

నగరంలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న క్షౌరవృత్తిదారులు, నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

లాభముందనుకుంటున్న ప్రతి రంగంలోకి కార్పొరేట్ సంస్థలు చొచ్చుకుపోతున్నాయి. ఇందులో ఇప్పుడు క్షౌరవృత్తి చేరింది. బ్యూటీ స్పా కేంద్రాల పేరుతో రోజుకొకటి చొప్పున పుట్టుకొస్తున్న సంస్థల వల్ల తమ వృత్తికి నష్టం వాటిల్లుతుందంటూ అనంతపురం నగరంలో క్షౌరవృత్తిదారులు ఆందోళనబాటపట్టారు. ఆదివారం అనంతపురం నగరంలోని అన్ని సెలూన్ దుకాణాలను మూసి వేసి నిరసనకు దిగారు. కార్పొరేట్ సంస్థల నుంచి తమ వృత్తికి ముప్పు ఉందంటూ ఆందోళన వ్యక్తం చేశారు.

'అనంత'లో పుట్టకొస్తున్న కార్పొరేట్ సంస్థలు

అనంతపురం నగరంలో ఒక్కటే రొజుకొకటి చొప్పున కార్పొరేట్ సెలూన్ కేంద్రాలు పుట్టకొస్తున్నాయి. పెద్దఎత్తున పెట్టుబడులతో ఆకర్షణీయంగా వీటిని ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటి వరకు చూస్తే దేశంలో ప్రముఖ కంపెనీలుగానున్న జావిద్ హబీబ్, నేచురల్స్, గ్రీన్ ట్రెండ్స్, లోరల్, లాక్మీ వంటితోపాటు కలిపి మొత్తం పదికిపైగా సెలూన్ కేంద్రాలు ఏర్పాటు చేయబడ్డాయి. వీటి పరిధిలో దాదాపు 200 మంది వరకు పనిచేస్తున్నారు. వీటన్నింటిలోనూ కలిపి రోజుకు రెండు లక్షల రూపాయల వరకు వ్యాపారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో మరిన్ని సంస్థల ఏర్పాటుకు ముందుకొస్తున్నాయి. ఈ మేరకు నెలకు రూ.20 లక్షలకుపైగా వ్యాపారం ఈ సంస్థల పరిధిలోనే జరుగుతోంది. దీంతో స్థానికంగా ఉన్న క్షౌరవృత్తిదారుల దుకాణాలపై వీటి ప్రభావం పడుతోంది.

వేలాది మంది ఉపాధిపై ప్రభావం

కార్పొరేట్ సంస్థలు విస్తరిస్తున్న కొద్దీ అనంతపురం నగరంలో ముందు నుంచి ఈ వృత్తి ఆధారపడి జీవిస్తున్న క్షౌరవృత్తిదారుల ఉపాధికి గండం పడుతోంది. తరతరాలుగా ఇదే వృత్తిని కులవృత్తిగా చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఈ రకంగా ఒక్క అనంతపురం నగరంలోనే 870 సెలూన్ షాపులున్నాయి. వీటిల్లో 2500 మంది వరకు పనిచేస్తున్నారు. ఇందులో అత్యధికమంది గ్రామీణ ప్రాంతాల నుంచి వలసొచ్చి జీవిస్తున్న వారే. గ్రామాల్లో తగినంత ఉపాధి లేకపోవడంతో నగరాలకు వలసొచ్చి నగరంలో ఉంటున్నారు. ఇప్పుడు ఈవృత్తి ఇక్కడ కూడా దెబ్బతింటే తాము ఏమి చేసి బతకాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా కొత్తగా ఏర్పాటవుతున్న కంపెనీల్లో నాయి బ్రహ్మణులే కాకుండా ఇతర కులాల వారూ ఉంటున్నారు. దీంతో ఈ వృత్తినే కులవృత్తిగా నమ్ముకుని జీవనం సాగిస్తున్న తమ పరిస్థితి ఏమిటని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

'అనంత'లో క్షౌర శాలలు బంద్

కార్పొరేట్ సంస్థల నుంచి తమ వృత్తికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ నాయి బ్రహ్మణ సేవా సంఘం (యువజన) ఆధ్వర్యంలో ఆదివారం నిరసన చేపట్టారు. ఉదయం నుంచి క్షౌరశాలలను మూసివేశారు. ఉదయం నగరంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. సప్తగిరి సర్కిల్ వద్ద నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు నిరసన ప్రదర్శన చేపట్టారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి అక్కడే నిరసన ప్రదర్శన చేశారు. క్షౌరవృత్తిపై తరతరాలుగా ఆధారపడి జీవిస్తున్న తమకు కార్పొరేట్ సంస్థల నుంచి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు పెనకచెర్ల చంద్రశేఖర్, సలహాదారులు ఎం.శ్రీనివాసులు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం నగరంలో మూతపడిన సెలూన్ దుకాణం

కులవృత్తినే నమ్ముకున్న వారికి ఉపాధి లేకుండాపోతోంది

మాకు క్షౌరవృత్తి కులవృత్తిగా ఉంది. తరతరాలుగా ఇదే వృత్తిని నమ్ముకుని జీవిస్తున్నాం. ఇప్పుడు రొజుకొక కార్పొరేట్ కంపెనీ నగరంలో పుట్టకొస్తోంది. అందులో ఇతర కులాలు, మతాల వాళ్లు కూడా పనిచేస్తున్నారు. దీంతో ఈ రంగంపై ఆధారపడి పనిచేస్తున్న నాయిబ్రహ్మణుల వృత్తికి దెబ్బపడుతోంది. ఈ కార్పొరేట్ కంపెనీల వల్ల జరిగే నష్టం నుంచి మాకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తున్నాం.

పెనకచెర్ల చంద్రశేఖర్,
అధ్యక్షులు,
నాయి బ్రహ్మణ యువజన సంఘం అనంతపురం.

ప్రతి నీటి బొట్టును ఒడిసిపడదాం

జలశక్తి అభియాన్ కేంద్ర నోడల్ అధికారి రాజేంద్రకుమార్ నేగి

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

కరువు జిల్లాలో ప్రతి నీటి బొట్టు ను ఒడిసి పట్టాలని జల శక్తి అభియాన్ సెంట్రల్ నోడల్ అధికారి రాజేంద్ర కుమార్ నేగి పేర్కొన్నారు. ఆదివారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో జల శక్తి అభియాన్ పై నిర్వహించిన సమావేశంలో జాతీయ ఉపాధి హామీ పథకం జాయింట్ కమిషనర్ శివప్రసాద్, జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నోడల్ అధికారి మాట్లాడుతూ జిల్లాలో జలశక్తి అభియాన్ క్రింద చేపట్టిన పనులు పూర్తి చేయడానికి అధికారులు దృష్టి సారించాలన్నారు. నీటి సంరక్షణ పనులతో పాటు ఉద్యానవన శాఖ పరిధిలో వివిధ రకాల పండ్ల తోటలు సాగు చేసేందుకు కృషి చేయాలన్నారు. జాయింట్ కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో జలశక్తి అభియాన్ క్రింద చేపట్టిన పనులు ప్రగతి గురించి వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అరుణ్ బాబు మాట్లాడుతూ, జిల్లాలో జల శక్తి అభియాన్ క్రింద నీటి సంరక్షణ కోసం వివిధ రకాల పనులు చేపడుతున్నామన్నారు. అందులో నీటి సంరక్షణ, వర్షపు నీటి నిల్వ, సాంప్రదాయ నీటి వనరులు, ట్యాంకులు పునరుద్ధరణ, రియూజ్, రీఛార్జ్ స్ట్రక్చర్స్ , వాటర్‌షెడ్ అభివృద్ధి, మొక్కలు పెంచడం లాంటి పనులను చేపడుతున్నామన్నారు. జల శక్తి అభియాన్ క్రింద గత ఏడాది మార్చి నుంచి ఇప్పటివరకు 6,138 పనులను చేపట్టగా అందులో 3295 పనులు పూర్తి చేసినట్లు వివరించారు. మరో 2843 పనులు జరుగుతున్నాయని వాటిని త్వరగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. జిల్లా వర్షపాతం, చేపట్టిన ఉపాధి పనులు, ఉద్యానవన సాగు, మైక్రో ఇరిగేషన్ అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ వివరించారు. అనంతరం డ్వామా, వ్యవసాయం, ఆర్‌డబ్ల్యుఎస్ తదితర శాఖల పరిధిలో చేపట్టిన పనులు పురోగతి గురించి వివరించారు. అనంతరం నోడల్ అధికారిని, శాస్త్రవేత్త రాఖీని సన్మానించి సత్యసాయి చిత్రపటాలను అందించి సత్కరించారు. ఈ సమావేశంలో డ్వామా పీడీ రామాంజనేయులు, వ్యవసాయ శాఖ అధికారి సుబ్బారావు, భూగర్భ జల శాఖ అధికారి రాజశేఖర్ రెడ్డి, పట్టు పరిశ్రమ శాఖ జెడి పద్మమ్మ, ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్, నీటి వనరుల శాఖ డిఇఇ గంగాద్రి, ఆర్‌డబ్ల్యుఎస్ ఈవో రషీద్ ఖాన్, డిఎఫ్ఓ రవీంద్రనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న అధికారులు

తేడా వస్తే ఆర్జీవీ తాటతీస్తాం

ఎపి పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు

అనంతపురం : సినీ దర్శకుడు రాంగోపాల్ వర్మ (ఆర్జీవీ) తీస్తున్న వ్యూహం సినిమాలో సోనియాగాంధీని తప్పుగా చూపిస్తే తాటతీస్తామని ఎపి పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు హెచ్చరించారు. పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఆదివారం అనంతపురం నగరానికి వచ్చిన ఆయన స్థానిక డిసిసి కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. వ్యూహం సినిమాపై మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు ఆయన స్పందిస్తూ ఆర్జీవీ గురించి పట్టించుకోవాల్సిన పనిలేదని చెప్పారు. ఆయన ఎవరో ఒకరి జీవిత చరిత్రను ఇతివృత్తంగా తీసుకుని వివాదం తీసుకొచ్చి లబ్ధిపొందాలని చూస్తూనే ఉంటారన్నారు. మానిసిక స్థితి సరిగాలేని వ్యక్తి ఆర్జీవీ అని ఎద్దేవా చేశారు. వ్యూహం సినిమా కూడా ఇందులో భాగమేనని చెప్పారు. అందులో సోనియాగాంధీ గురించి తప్పుగా చూపిస్తే ఆయన తాటతీస్తామని హెచ్చరించారు. సోనియా అనుకుని ఉంటే ఆనాడే ప్రధానమంత్రి అయి ఉండేవారని చెప్పారు. అదే రకంగా రాహుల్‌గాంధీ కూడా అయి ఉండేవారని తెలిపారు. ఆర్జీవీకి అనవసరమైన ప్రచారాన్ని కల్పించవద్దని మీడియాకు సూచించారు.

రాష్ట్ర హాకీజట్టులో ధర్మవరం క్రీడాకారులు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ఒరిస్సాలో ఈ నెల 27నుంచి జూలై 7వ తేదీ వరకు జరగనున్న 13వ జాతీయ జూనియర్ మహిళల హాకీ టోర్నమెంటులో పాల్గొనే రాష్ట్ర జట్టుకు ధర్మవరం క్రీడా కారులు ఎంపికైనట్లు హాకీ సంఘం జిల్లా కార్యదర్శి బంధనాధం సూర్యప్రకాశ్ తెలిపారు. ధర్మవరం పట్టణానికి చెందిన శ్రావణి, సింధు, నందిని హాకీ రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారన్నారు. ధర్మవరం క్రీడాకారులు పలు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రాణించారన్నారు. క్రీడాకారులను ఆదివారం సూర్యప్రకాశ్‌తో పాటు హాకీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బివి శ్రీనివాసులు, గౌరవాధ్యక్షుడు బండి వేణుగోపాల్, పల్లెం వేణుగో పాల్, ఉడుముల రామచంద్ర, గౌరీప్రసాద్, అంజన్న, అరవిందగౌడ్, హాకీ కోచ్ హుసేన్ అభినందించారు.

రాష్ట్ర జట్టుకు ఎంపికైన ధర్మవరం క్రీడాకారులు

వలసల నివారణే లక్ష్యం

జిల్లా నీటి యాజమాన్యసంస్థ పీడీ రామాంజనేయులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా ఉపాధి కూలీలకు పనులు కల్పించి వలసలు నివారించడమే తమ ప్రథమ కర్తవమని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ రామాంజనేయులు పేర్కొన్నారు. ప్రభుత్వం కూలీలకు ఉపాధి కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తుందని అందుకోసం జిల్లా వ్యాప్తంగా పండ్ల తోటల పెంపకాలు, నీటి సంరక్షణ పనులు, ల్యాండ్ లెవెలింగ్ తదితర పనులు చేపడుతోందని చెప్పారు. ఈ మేరకు ఆయన ఆదివారం ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు విషయాలను వెలిబుచ్చారు.

ప్రశ్న: ఈ ఏడాది కూలీలకు పనులు కల్పించడానికి ఎలాంటి ప్రణాళికను తీసుకుంటున్నారు ?

జవాబు : జూలై నెల నుండి క్షేత్రస్థాయిలో సిబ్బందిని సుమయాత్తం చేస్తున్నాం. రోజు జిల్లా వ్యాప్తంగా లక్ష మందికి పైగా పనులు కల్పించే విధంగా చర్యలు చేపడుతున్నాం. ఉపాధి హామీ పథకం ద్వారా ప్రజలకు పనులు కల్పించి వలసలు నివారించడమే ప్రథమ లక్ష్యం. 2023- 24 ఆర్థిక సంవత్సరానికి కావలసిన పనుల గుర్తింపు కార్యక్రమం క్షేత్రస్థాయిలో జరుగుతోంది. జియోగ్రాఫిక్ ఇన్సులేషన్ సిస్టం ద్వారా నీటి సంరక్షణ పనులు, ఉమ్మడి ఆస్తుల పునరుద్ధరణ, వ్యక్తిగత పనులను గుర్తించి అంచనాల తయారుచేసి పరిపాలన అనుమతులు తీసుకుని కూలీలకు పనులు కల్పిస్తాం.

ప్ర: జిల్లా నీటి యజమాన్య సంస్థ ఆధ్వర్యంలో ఏయే పనులు చేపడుతున్నారు ?

జ : ప్రస్తుతం శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా పండ్ల తోటల పెంపకం, చెత్తతో సంపద సృష్టించే కేంద్రాల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. వాటితో పాటు కొత్త పనులను గుర్తించి ఉపాధి కల్పించడమే ప్రథమ కర్తవ్యంగా కృషి చేస్తున్నాం. పండ్ల తోటలు పెంపకం ద్వారా రైతులకు ఎంతో లబ్ధి చేకూరుస్తున్నామని చాలా మంది రైతులు పండ్ల తోటలు సాగుకు మక్కువ చూపుతున్నారు.

ప్ర: డిఆర్‌డిఎ సమన్వయంతో మునగ ప్లాంటేషన్ ఎంతమందికి ఇస్తున్నారు ?

జ : శ్రీ సత్య సాయి జిల్లాలో డిఆర్‌డిఎ సమన్వయంతో పొదుపు సంఘాల సహకారంతో జిల్లా వ్యాప్తంగా నర్సరీలు ఏర్పాటుకు నివేదికలు తయారు చేశాం. ఆయా గ్రామాల్లో పొదుపు సంఘాల సభ్యుల ద్వారా ఇంటింటికి ఐదు మునగ మొక్కలు పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నాం. మొక్కలు పెంచడానికి నర్సరీలు గుర్తించి వాటిలో మొక్కలు పెంచి అందజేసి ప్రజలకు లబ్ధి చేకూర్చే విధంగా చర్యలు చేపడుతున్నాం. ప్రజలు ఇళ్లవద్ద తోటల ల్లో, గడ్డివాముల వద్ద పెంచుకొని వాటి నుండి లబ్ది చేకూరి విధంగా చర్యలు తీసుకుంటున్నాం. దీనివల్ల రైతులకు ఎంతో ఉపయోగం.

ప్రశ్న: ఉపాధి బిల్లులు చెల్లింపు విషయంలో జాప్యం ఎందుకు జరుగుతోంది ?

జ : ఉపాధి కూలీల బిల్లులు చెల్లింపు విషయంలో కొంత జాప్యం జరుగుతున్న విషయం వాస్తవమే. కేంద్ర ప్రభుత్వ నిధులతో పాటు రాష్ట్ర ప్రభుత్వ వాటా కింద బిల్లులు మంజూరు చేయాల్సి ఉండడంతో ఈ జాప్యం జరిగింది. ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటల పెంపకం చేపట్టిన రైతులకు బిల్లులు ఉపాధి హామీ కూలీలకు చెల్లించే బిల్లులు నెలనెలా చెల్లించడానికికసరస్తు చేస్తున్నాం .అదేవిధంగా కొత్త పనులను గుర్తించి కూలీలకు ఉపాధి కల్పించనున్నాం. పని దినాలను పెంచేందుకు ప్రభుత్వానికి సిఫారసు చేశాం. వర్షాకాలం ఆసన్నమైనందున ఉపాధి కూలీలు వ్యవసాయ పనులకు వెలుతున్న తరుణంలో కొత్త పనులను గుర్తించడానికి చర్యలు చేపడుతున్నాం.

పీడీ రామాంజనేయులు

సుధాకర్‌ను సన్మానిస్తున్న శ్రీశ్రీకళా వేదిక సభ్యులు

కవి సుధాకర్‌కు సత్కారం

చిలమత్తూరు: శ్రీశ్రీకళా వేదిక ఆధ్వర్యంలో ఆదివారం మైసూర్ శాఖ నిర్వహణలో జరిగిన తెలుగు కన్నడ గోష్టి కార్యక్రమంలో చిలమత్తూరు మండలానికి చెందిన వడ్డి సుధాకర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కవితా గోష్టిలో దేశవ్యాప్తంగా 120 మందిని ఎంపిక చేశారు. సాహితీరంగంలో తను ఎంపికైనట్లు సుధాకర్ తెలిపారు. ఈ సందర్భం గా శ్రీశ్రీకళావేదిక ఛైర్మన్ డా. కత్తిమండ ప్రతాప్ సుధాకర్‌ను అభినందించి మైసూర్‌లోని సాహితీసంస్థల ప్రముఖుల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. తోటి కవులు సుధాకర్‌కు అభినందనలు తెలిపారు.

నీట్ ర్యాంకర్‌కు సన్మానం

కదిరి టౌన్: నీట్‌లో 218వ ర్యాంక్ సాధించిన కదిరి పట్టణానికి చెందిన పట్నం నిఖిల్ కుమార్‌ను ఆదివారం స్థానిక గాండ్ల కల్యాణ మండపంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నిఖిల్ తల్లిదండ్రులు భవానీ, హరి, కల్యాణ మండపం కమిటీ అధ్యక్షులు బసెట్టి గంగప్ప, ఎన్‌హెచ్‌ఆర్‌పిఎఫ్ జిల్లా అధ్యక్షులు మహమ్మద్ షాకీర్, జి.ఈశ్వరయ్య, చంద్రశేఖర్, నాగరాజు, రామచంద్ర, బాదుల్లా, సినీ ఆర్టిస్ట్ పవన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

'అరుణాచలం'కు ప్రత్యేక బస్సులు

ధర్మవరం టౌన్ : గురుపౌర్ణమి సందర్భంగా తమిళనాడు రాష్ట్రంలోని అరుణాచలం పుణ్యక్షేత్రానికి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామని ఆర్టీసీ డీఎం మోతీలాల్‌నాయక్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జూలై 2వ తేదీ ఉదయం 6 గంటలకు ధర్మవరం నుంచి బయల్దేరి కాణిపాకం మీదుగా అరు ణాచలం చేరుతుందన్నారు. మరుసటి రోజు మధ్యాహ్నం 12 గంటలకు అక్కడ బయల్దేరి ధర్మవరం చేరుకుంటుందన్నారు. రాను పోను ఛార్జీలు సూపర్ లగ్జరీ బస్సుకు రూ. 1,400, ఎక్స్‌ప్రెస్ బస్సుకు రూ. 1,160 ఉంటుందన్నారు. ప్రయాణికులు టికెట్లను ఆన్‌లైన్‌లో రిజర్వేషన్ చేసుకోవచ్చన్నారు.

నేడు కేంద్ర జలశక్తి బృందం రాక

గోరంట్ల రూరల్: మండల పరిధిలోని పలు గ్రామాల్లో గతంలో చేపట్టిన పనులను పరిశీలించడానికి కేంద్ర జల శక్తి బృందం సోమవారం మండలానికి వస్తున్నట్లు ఎంపిడిఒ రఘునాథ గుప్తా తెలిపారు. ఆ బృందం మందలపల్లి పంచాయతీ పరిధిలోని ఖాజాపురం గ్రామంలో బోర్వెల్ రీఛార్జి స్ట్రక్చర్‌తో పాటు మండలంలో చేపట్టిన పలు పనులను పరిశీలిస్తుందన్నారు. కావున మండల పరిధిలోని గ్రామ సర్పంచిలు, ఎంపిపి, జడ్పిటిసి, వైస్ ఎంపిపిలు, ఎంపిటిసిలు, మండల కోఆప్షన్ సభ్యులు, ఉపాధి, సచివాలయ సిబ్బంది హాజరుకావాలని ఆయన సూచించారు.

9న విజయవాడలో ములాయంసింగ్ విగ్రహావిష్కరణ

మడకశిర: జూలై 9వ తేదీ విజయవాడలో ఉత్తరప్రదేశ్ మాజీ సీఎం ములాయంసింగ్ యాదవ్ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నట్లు మాజీ మంత్రి నీలకంఠాపురం రఘువీరారెడ్డి ఆదివారం తెలిపారు. ఆ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అఖిలేష్‌యాదవ్ హాజరుకానున్నారని తెలిపారు.

నాగశేషుకు న్యాయం చేయాలి

కదిరి టౌన్: 2018 డీఎస్సీలో అన్యాయం జరిగిన నాగశేషుకు న్యాయం చేయాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. న్యాయం కోరుతూ నాగశేషు పట్టణంలో చేపట్టిన నిరసన దీక్ష శిబిరాన్ని ఆదివారం సిఐటియు నాయకులు లక్ష్మీనారాయణ, జగన్మోహన్, రామ్మోహన్, ముస్తాక్, ఫిరోజ్, ఫాజిల్ తదితరులు సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2018 డీఎస్సీలో జిల్లా స్థాయిలో 4వ ర్యాంకు సాధించినా ప్రభుత్వ విధానం వల్ల ఉద్యోగం రాక కోర్టును ఆశ్రయించినా న్యాయం జరగకపోవడం బాధాకరమన్నారు.

రైతు సంఘం మండల కమిటీ ఎంపిక

నల్లచెరువు: మండల పరిధిలోని సిపిఎం కార్యాలయంలో ఆదివారం రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బడా సుబ్బిరెడ్డి ఆధ్వర్యంలో రైతు సంఘం మండల నూతన కమిటీని ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా ఎన్.మునిప్రతాప్, కార్యదర్శిగా ఎం.వెంకటస్వామిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన కమిటీ సభ్యులు రైతుల సమస్యలపై దృష్టి కేంద్రీకరించి వారి సమస్యల పరిష్కారంలో నిరంతరం పోరాటాలకు సిద్ధంగా ఉండాలని సూచించారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతి నాయకుడు ఆవిధంగా ముందుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు శ్రీరాములు, తనకల్లు రైతు సంఘం నాయకులు శివన్న, వివి రమణ, ఎస్వీ రమణ పాల్గొన్నారు.

రెండేళ్లుగా పైపులైన్ లీకేజీ

మడకశిర: మండల పరిధిలోని బుళ్లసముద్రం ఎస్సీ కాలనీలో పైపులైన్ లీకేజీ కావడంతో ఆ నీరు అంగన్వాడీ సెంటర్ ముందు నుంచి పోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కాలనీవాసులు పేర్కొంటున్నారు. దాదాపు రెండేళ్ల నుంచి ఈ సమస్య ఉన్నా అధికారులు కానీ, ప్రజా ప్రతినిధులు కానీ పట్టించుకోకపోవడం గమనార్హం. ఇకనైనా పైపులైన్ లీకేజీని అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని కాలనీవాసులు కోరుతున్నారు.

అంగనవాడీ సెంటర్ ముందు ప్రవహిస్తున్న నీరు

'రాష్ట్రంలో రాక్షస పాలన'

ప్రజాశక్తి -పెనుకొండ

రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగు తోందని టిడిపి జిల్లా అధ్యక్షులు బికె పార్థసారథి పేర్కొన్నారు. టిడిపి ఆధ్వర్యంలో 'భవిష్యత్తుకు గ్యారెంటీ' పేరుతో చేపట్టిన బస్సుయాత్ర ఆదివారం మండల పరిధిలోని శెట్టిపల్లి క్రాస్ వద్ద పెనుకొండ నియోజకవర్గంలోకి చేరింది. ఈ సందర్భంగా శెట్టిపల్లిలో టిడిపి హయాంలో ఏర్పాటు చేసిన బ్రిడ్జిపైన, రాంపురం గ్రామ పంచాయతీలో సురక్షిత తాగునీటి పథకం వద్ద వారు సెల్ఫీ తీసుకున్నారు. అనంతరం వెంకటరెడ్డిపల్లి, తిమ్మాపురం మీదుగా ఎన్టీఆర్ సర్కిల్‌కు చేరుకొని ఎన్టీఆర్, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బాబయ్య దర్గాలో పూల చాదర్‌ను సమర్పించారు. అలాగే ఊరువాకిలి ఆంజనే యస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి పురవీధుల గుండా టిడిపి కార్యాలయం వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా పార్థసారథి మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో సంపదను సృష్టించి సంక్షేమ పథకాలను ప్రజలకు అందించే సత్తా ఉన్న ఏకైక నాయకుడు చంద్రబాబు అన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు పల్లె రఘునాథ్ రెడ్డి, కాలవ శ్రీనివాసులు, పరిటాల సునీత, మాజీ ఎంపి నిమ్మల కిష్టప్ప, జిల్లా ఇన్‌ఛార్జి బిటి. నాయుడు, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి, మాజీ ఎమ్మెల్యే ఈరన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి అంబికా లక్ష్మీనారాయణ, రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి కె.లక్ష్మీపతి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ, రాష్ట్ర కార్యదర్శి జెఎల్ మురళీధర్, నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యాత్రలో పాల్గొన్న పార్థసారథి, పరిటాల సునీత, తదితరులు

వైసిపిని సాగనంపుదాం

రొద్దం : రాష్ట్రానికి పట్టిన దరిద్రపు ముఖ్యమంత్రిని సాగనంపే సమయం ఆసన్నమైందని టిడిపి నాయకులు పేర్కొన్నారు. రొద్దంలో ఆదివారం మాజీ ఎమ్మెల్యే బికె పార్థసారథి ఆధ్వర్యంలో టిడిపి బస్సు చైతన్య యాత్ర చేపట్టగా పలువురు జిల్లా నాయకులు హాజరయ్యారు. ముందుగా తురకలాపట్నం గ్రామంలో యాత్ర నిర్వహించారు. అనంతరం రొద్దంలోని చావిడి వద్ద నాయకులు మాట్లాడుతూ నాలుగేళ్లలో ప్రజలు నానా అవస్థలు పడ్డారన్నారు. చంద్రబాబు సూపర్ సిక్స్ కార్యక్రమం ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చి ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తారన్నారు. కావున 2024 లో టిడిపిని అధికారంలోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు కాలవ శ్రీనివాసులు, పరిటాల సునీత, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, అంబికా లక్ష్మీనారాయణ, సుబ్బరత్నమ్మ, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు విస్తృతం చేయాలి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ధర్మవరం పట్టణంలో లయన్స్ క్లబ్ సేవలు అమోఘమని, ఈ సేవలు మరింత విస్తృతం చేయాలని లయన్స్ మాజీ గవర్నర్ రమేష్‌నాథరెడ్డి సూచించారు. పట్టణంలోని లక్ష్మీ చెన్నకేశవపురంలో ఉన్న లయన్స్ కంటి ఆస్పత్రిలో ఆదివారం లయన్స్ క్లబ్ వ్యవస్థాపకుడు పిట్టా వెంకటస్వామి అధ్యక్షతన నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని పేదల కోసం లయన్స్ క్లబ్ చేపట్టిన సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు బండి వేణు గోపాల్, పల్లెం వేణు గోపాల్, నారాయణరెడ్డి, వెంకటస్వామి, గోసే రాధాకృష్ణ, జయకుమార్, బివి శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, శాగా సురేశ్, ఉట్టి శివప్రసాద్, ఎం.క్రిష్ణ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం : లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా గూడూరు మోహన్‌దాసు, కార్యదర్శిగా గూడూరు రాజగోపాల్, కోశాధికారిగా వేణుగోపాలాచార్యులు, ఉపాధ్యక్షులుగా పుట్లూరు నరసింహులు, అజయ్‌కుమార్, జగదీశ్వరప్రసాద్, సహాయ కార్యదర్శిగా వెంకటేష్ కుమార్, సహాయ కోశాధికారిగా కొత్త శ్రీరాములు, ట్యామర్ రాధాక్రిష్ణ, సూరే నాగరాజుతో పాటు 11 మందిని డైరెక్టర్లుగా ఎంపిక చేశారు. అనంతరం వారి చేత ప్రమాణ స్వీకారం చేయించారు.

లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గసభ్యులు

జనంలో చైతన్యం తీసుకురావడమే జెవివి లక్ష్యం

ప్రజాశక్తి-హిందూపురం

జనంలో చైతన్యం తీసుకొచ్చి శాస్త్రీయ దృక్పథాన్ని, సైన్స్‌ను ప్రచారం చేయడమే జన విజ్ఞాన వేదిక(జెవివి) లక్ష్యమని జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఈటి రామ్మూర్తి పేర్కొన్నారు. పట్టణంలోని చైతన్య నగర్‌లో ఉన్న పీపుల్స్ ఆసుపత్రిలో ఆదివారం జెవివి సభ్యత్వ నమోదుకు సంబంధించిన గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జెవివి ఆధ్వర్యం లో సమాజంలో శాస్త్రీయ విజ్ఞానంపై ప్రచారం చేయడం, నిత్య జీవితంలో ప్రజాలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు శాస్త్రీయ పరిష్కారాలను చూపుతున్నామన్నారు. సమాజ ప్రగతికి ఆటంకాలైన మూఢనమ్మకాల నిర్మూలనకు కృషి చేస్తున్నామ న్నారు. దీంతో పాటు విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తిని కలిగించడానికి చెకు ముఖి టాలెంట్ టెస్టులు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి నెల అల్ హిలాల్ పాఠశాల ఆవరణలో ఫిట్స్ క్యాంపు నిర్వహించి వేలాది మంది మూర్ఛవ్యాధిగ్రస్తులకు సేవలను అందిస్తున్నామన్నారు. సైన్స్ పట్ల ఆసక్తి ఉండి, నిస్వార్థంగా సమాజ సేవ చేయాలని సంకల్పించిన విద్యావంతులు జెవివిలో సభ్యత్వం తీసుకోవాలన్నా రు. కార్యక్రమంలో జెవివి నాయకులు రామకృష్ణ, ఉగ్రప్ప, లక్ష్మీపతి, రవీంద్రారెడ్డి, నరసింహులు, నాగరాజుగుప్తా, జిఆర్ శ్రీనివాసులు, అబ్దుల్ హక్, ప్రభాకర్, ఎం.రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు గోడపత్రికలను విడుదల చేస్తున్న జెవివి నాయకులు

'జగనన్న కాలనీ'లో మౌలిక వసతులు కరువు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

మండల పరిధిలోని నిడిమామిడి సమీపంలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని కాలనీ వాసులు కోరారు. నిడిమామిడి, కొట్లపల్లి, బుగ్గపల్లి పంచాయతీల్లోని గ్రామాలకు చెందిన ఇల్లు లేని నిరుపేదలకు కొత్త నిడిమామిడి ఎస్సీ కాలనీ సమీపంలో జగనన్న కాలనీ ఏర్పాటుచేసి పట్టాలు మంజూరు చేశారు. ఇందులో వంద మందికి పైగా గృహాలు మంజూరు కాగా 60 మందికి పైగా నిర్మాణాలు చేపట్టగా వివిధ దశల్లో ఉన్నాయి. మరికొందరు గృహ ప్రవేశం కూడా చేశారు. నాలుగేళ్లయినా కాలనీలో రహదారులు, నీటి సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. ట్యాంకర్లతో నీరు కొని గృహ నిర్మాణం పనులు చేపట్టామన్నారు. నేటికీ విద్యుత, నీటి సౌకర్యం లేకపోవడంతో ఎస్సీ కాలనీలోని ట్యాంకు, వ్యవసాయ బోర్లు, బావులను ఆశ్రయిస్తున్నామని తెలిపారు. మౌలిక వసతులు లేకపోవడంతో గృహ నిర్మాణాలు పూర్తయినా కొందరు గృహ ప్రవేశం చేయలేదని పేర్కొంటున్నారు. కావున అధికారులు వెంటనే స్పందించి మౌలిక వసతులు కల్పించాలని ఆ కాలనీవాసులు కోరుతున్నారు.

జగనన్న కాలనీ

పండ్ల తోటల పరిశీలన

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

మండల పరిధిలోని పోతుల నాగేపల్లి వద్ద ఉపాధి హామీ చట్టం ద్వారా సాగు చేసుకుంటున్న పండ్ల తోటలను ఆదివారం కేంద్ర జలశక్తి అభియాన్ బృందం పరిశీలించింది. సెంట్రల్ నోడల్ అధికారి రాజేంద్రకు మార్, సీనియర్ సైంటిస్టు (గ్రౌండ్ వాటర్) రాఖీ, జాయింట్ కమిషనర్ శివప్రసాద్, పిడి రామాంజనేయులు, ఎపిడి వెంకటాచలపతి రైతు చంద్రమ్మ తోటలో సాగు చేసిన చీనీ తోటను పరిశీలించి జలశక్తి అభియాన్, ఉపాధి హామీ చట్టం ద్వారా సాగు చేసుకుంటున్న తోటల గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే అంతర పంటల సాగు వివరాల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ప్రభుత్వం పండ్ల తోటలు సాగు చేసుకుంటున్న రైతులకు విరివిగా ప్రోత్సాహకాలు అందించడం సంతోషంగా ఉందన్నారు. రైతుల అభిప్రాయాలు తెలుసుకొన్న అధికారులు సంతృప్తిని వ్యక్తం చేశారు. ఆ బృందం వెంట ఎపిఒ అనిల్‌కుమార్‌రెడ్డి, క్షేత్ర సహాయకులు మురళీమోహన్‌రెడ్డి, వైసిపి నాయకులు వెంకట్రామిరెడ్డి, రైతులు, తదితరులు వున్నారు.

చీనీ తోటను పరిశీలిస్తున్న అధికారులు

నేడు మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ ర్యాలీ

ఓబుళదేవరచెరువు: అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సోమవారం(నేడు) ఓబుళదేవరచెరువులో మహిళా పోలీసుల ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు స్థానిక విజ్ఞాన్ కళాశాల విద్యార్థులు ర్యాలీ చేపట్టనున్నారు. ర్యాలీలో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని ఎస్ఐ గోపి, తనకల్లు సెబ్ సిఐ, ఎస్ఐ శ్రీధర్ కోరారు.

ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న జల శక్తి అభియాన్ బృందం

'ఉపాధి' పనుల పరిశీలన

ప్రజాశక్తి-కొత్తచెరువు

మండలంలో జాతీయ ఉపాధి చట్టం కింద చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఆదివారం జల శక్తి అభియాన్ కేంద్ర బృందం సభ్యులు రాజేంద్రకుమార్ నేగి, శాస్త్రవేత్త రాఖీ, ఉపాధి హామీ జాయింట్ కమిషనర్ శివప్రసాద్ పరిశీలించారు. ఇందులో భాగంగా స్థానిక పుట్టపర్తి రోడ్డులోని రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న పాపన్నకుంటలో అమృత్ సరోవర్ పనులను పరిశీలించి వర్షం వచ్చినప్పుడు ఆ నీరు గుంతల్లోకి చేరడం ద్వారా భూగర్భ జలాలు పెరుగుతాయని సూచించారు. ఫారం పాండ్ రైతులు ఉపాధి హామీ కింద పొలాల్లో సాగు చేసుకున్న మామిడి తోటలను, ధర్మవరం రోడ్‌లో సాగులో ఉన్న మొక్కజొన్న పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాటాడుతూ నిధులు దుర్వినియోగం చేయకుండా రైతులకు ఉపయోగపడేలా పనులు చేయాలని సూచించారు. ఫారంపాండ ట్రెంచుల తవ్వ కాలు చేపట్టడం ద్వారా వర్షం నీరు నిల్వ ఉండి బోర్లలో నీటి శాతం పెరుగుతుందన్నారు. గ్రామాల్లో వలస వెళ్లకుండా ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వారి వెంట జెడిఎ సుబ్బారెడ్డి, ఎపిఎంఐపి పిడి సుదర్శన్, ఉపాధి హామీ పిడి రామాంజనేయులు, హార్టికల్చర్ అధికారి రాజశేఖర్ రెడ్డి, ఎపిడి రఘు నాథరెడ్డి, ఎంపిడిఒ సిద్ధారెడ్డి, ఎపిఒ నాగిరెడ్డి, ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు ఉన్నారు.

కదిరి వాసికి సైర్ ఫెలోషిప్

ప్రజాశక్తి-కదిరి టౌన్

విశ్రాంత రైల్వే ఉద్యోగి ఎస్.బాబురావు కుమారుడు డాక్టర్ ఎస్.ప్రశాంత్ జీవన్ కుమార్ ప్రతిష్ఠాత్మక సెర్బ్- సైర్ ఫెలోషిప్‌కు ఎంపికయ్యారు. ప్రస్తుతం ఆయన డైరెక్టరేట్ ఆఫ్ ఫ్లోరికల్చర్ రీసెర్చ్ సెంటర్ పూణేలో సీనియర్ శాస్త్రవేత్తగా పనిచేస్తున్నారు. ఈ ఫెలోషిప్ ద్వారా ఆయన 6 నెలల పాటు స్పెయిన్‌లోని యూనివర్సిటీ ఆఫ్ విగోలో ప్రొఫెసర్ జీసస్ పరిశోధనశాలలో "ఎక్స్‌ట్రాక్షన్, ప్యూరిఫికేషన్, క్యారెక్టరైజేషన్ అండ్ కో పిగ్మెంటేషన్ స్టడీస్ ఆఫ్ ఆంథోసైనిన్స్ ఫ్రం ఫ్లవర్ క్రాప్స్" అనే అంశంపై పరిశోధన చేసేందుకు భారత ప్రభుత్వం సైర్ ఫెలోషిప్ మంజూరు చేసింది. ప్రశాంత్ జీవన్ కుమార్ ఐఐటి ఖరగ్‌పూర్ నుంచి డాక్టరేట్ డిగ్రీ పొందారు. ఈయనవి 75 పరిశోధన పత్రాలు జాతీయ, అతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురించబడ్డాయి. వాటికి 1,760 సైటేషన్స్ వచ్చాయి. ఈ ఫెలోషిప్‌కి ఎంపిక కావడం పట్ల వారి కుటుంబ సభ్యులు, సహోద్యోగులు, స్నేహితులు హర్షం వ్యక్తం చేశారు.

'జగనన్న సురక్ష' గురించి ప్రజలకు వివరిస్తున్న అధికారులు

గడప గడపకూ జగనన్న సురక్ష

ప్రజాశక్తి-గోరంట్ల రూరల్

'జగనన్న సురక్ష'లో భాగంగా ఆదివారం అధికారులు మండల పరిధిలోని వానవోలు తండా, ముత్తరాయిని తండా, గుంటిపల్లి తండాల్లో పర్యటించారు. డిపిఒ విజయ్‌కుమార్‌రెడ్డి పర్యవేక్షణలో ఎంపిడిఒ రఘునాథ్‌గుప్తా ఆధ్వర్యంలో పంచాయతీ సెక్రటరీలు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు ప్రతి ఇంటి వద్దకు వెళ్లి 'జగనన్న సురక్ష' లో భాగంగా 11 రకాల సేవలను ఉచితంగా అందిస్తున్నట్లు ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని కుటుంబాలు, సర్టిఫికెట్స్ పొందడంలో ఇబ్బందులను గుర్తించి సత్వర పరిష్కారం చూపు తామని తెలిపారు. జూలై 1వ తేదీ క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ బాబ్‌జాన్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య నిపుణులు

పేదల సేవలోనే నిజమైన సంతృప్తి

ధర్మవరం టౌన్ : పేదలకు సేవలందించడంలోనే నిజమైన సంతృప్తి లభిస్తుందని యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు వైకె శ్రీనివాసులు పేర్కొన్నారు. పట్టణంలోని బాలురు ఉన్నత పాఠశాలలో ఆదివారం యువర్స్ ఫౌండేషన్ సౌజన్యంతో బెంగుళూరుకు చెందిన కావేరి ఆస్పత్రి యాజమాన్యం ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో కంటి చూపు మందగించిన వంద మందికి కంటి వైద్య నిపుణులు సౌమ్య, అనూష ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. అలాగే కంటి పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వైకె శ్రీనివాసులు మాట్లాడుతూ యువర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి నెలా పేదల కోసం ఉచిత కంటి వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ కార్యదర్శి సుంకు సుకుమార్, కోశాధికారి రాధాక్రిష్ణ, సభ్యులు పోలా ప్రభాకర్, చాంద్‌బాషా, డాక్టర్ సుబ్బారావు, రమేష్‌బాబు, నాగార్జున, పీఆర్‌ఓలు మునీంద్ర, సతీష్ పాల్గొన్నారు.

అక్కదేవతలకు ప్రత్యేక పూజలు

పుట్టపర్తి రూరల్ : మండల పరిధిలోని పెడపల్లి దొడ్డిగుండ్ల అక్కదేవతల ఏలవ గంప కార్యక్రమాన్ని ఆదివారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. పెడపల్లి గ్రామానికి చెందిన వీరచెన్నప్ప, చంద్రాయుడు, శ్రీరాములు, రామప్ప, జయప్ప ఆధ్వర్యంలో అక్కదేవతలకు మూడు రోజుల నుంచి పూజారులు నారా యణస్వామి , గంగాద్రి ప్రత్యేక పూజలు నిర్వహించిరు. ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారికి మొక్కు తీర్చుకున్నారు. అలాగే గుడి ఆవరణలో పరుష నిర్వహించారు. భక్తులు, ప్రజలకు పెడపల్లి గ్రామానికి చెందిన డాక్టర్ రాఘవేంద్ర ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో పెడపల్లి, సుబ్బరాయునిపల్లి, కరావులపల్లి, మార్లపల్లి కోనాపురం, బత్తలపల్లి, గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజాసేవలో రోటరీ క్లబ్

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ప్రజాసేవలో రోటరీ క్లబ్ ఎల్లప్పుడూ ముందుండాలని, క్లబ్‌కు మంచి గుర్తింపు తెచ్చేలా కృషి చేయాలని ముఖ్య అతిథులు, అసిస్టెంట్ రీజనల్ కోఆర్డినేటర్ కె.శ్రీరామమూర్తి, అసిస్టెంట్ గవర్నర్ తిమ్మారెడ్డి సభ్యులకు సూచించారు. పట్టణంలో శనివారం రాత్రి నూతన కమిటీని ఎన్నుకున్నారు. అనంతరం ముఖ్య అతిథులు మాట్లాడుతూ ఇప్పటికే దేశ స్థాయిలో రోటరీ క్లబ్‌కు ప్రత్యేక స్థానం ఉందని, అందులో ధర్మవరం రోటరీ క్లబ్ మరింత గుర్తింపు తెచ్చుకోవడం సంతోషంగా, గర్వంగా ఉందన్నారు. సేవాభావంతో చేసినప్పుడే నిజమైన సంతృప్తి ఉంటుందన్నారు. అనంతరం వారు కమిటీ నూతన అధ్యక్షులు డి.జయసింహ, కార్యదర్శి డి.నాగభూషణ, కోశాధికారి వై.సుదర్శన గుప్తాల చేత, అనుబంధ సంస్థ ఇన్నర్ వీర్ క్లబ్ కమిటీగా నూతన అధ్యక్షులు గట్టు నాగరత్న, కార్యదర్శి కె.ఆదిలక్ష్మి, కోశాధికారి బి.భాగ్యలక్ష్మిల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ముఖ్య అతిథులను కమిటీ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వనజ మోహన్, సత్రశాల ప్రసన్నకుమార్, కె.శ్రీనివాసులురెడ్డి, బండారు చలం, టి.రత్నశేఖర్‌రెడ్డి, జి.కొండయ్య, పి.కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

పాముకాటుతో బాలుడు మృతి

బత్తలపల్లి: ఇంటి ముందు ఆడుకుంటున్న ఐదేళ్ల బాలుడిని పాము కాటు వేయడంతో మృతి చెందిన సంఘటన ఆదివారం మండల పరిధిలోని గరికలపల్లిలో చోటుచేసు కుంది. వివరాలు.. గరికలపల్లి గ్రామానికి చెందిన మబ్బు నరేష్, లక్ష్మీ దంపతులకు యశ్వంత్(5), హర్ష ఇద్దరు కుమారులు. మధ్యాహ్నం వరకూ బాగా ఆడుకున్న యశ్వంత్ ఉన్నఫళంగా అస్వస్థతకు గురికావడంతో తల్లిదండ్రులు స్థానిక ఆర్డీటీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. బాలుడిని విషపురుగు కాటు వేయడంతోనే అస్వస్థతకు గురై మృతి చెందినట్లు వైద్యులు తెలిపారన్నారు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. విషయం తెలిసిన వెంటనే సర్పంచి పద్మావతి, వైసిపి నాయకులు చెన్నారెడ్డి, నాగిరెడ్డి, ఈశ్వరయ్య, ఆంజనేయులు, తదితరులు అక్కడికి వెళ్లి బాలుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ద్విచక్ర వాహనాల ఢీ.. ఇద్దరికి తీవ్రగాయాలు

అమరాపురం : రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం అమరాపురంలో చోటుచేసు కుంది. స్థానిక తహశీల్దార్ కార్యాలయం సమీపంలో ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ సంఘటనలో జబీవుల్లా, తిప్పేస్వామి తీవ్రంగా గాయపడగా స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో కర్నాటకలోని శిరకు తీసుకెళ్లారు.

కరాటే ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

కరాటేతో ఆత్మస్థైర్యం పెంపు

ధర్మవరం టౌన్ : కరాటేతో ఆత్మస్థైర్యం పెంపొందుతుందని వన్ టౌన్ సీఐ సుబ్రహ్మ ణ్యం పేర్కొన్నారు. స్థానిక కొత్తపేట బాలికల ఉన్నతపాఠశాల ఆవరణలో ఆదివా రం కరాటే మాస్టర్ ఇనాయత్‌బాషా ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్లాక్ బెల్ట్ గ్రేడింగ్ టెస్టు నిర్వహించారు. ప్రతిభ కనబరచిన 14 మంది విద్యార్థులకు ముఖ్యఅతిథిగా హాజరైన సీఐ ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో బాలబాలికలకు కరాటే ఎంతో అవసరమన్నారు. సమాజంలో జరుగుతున్న దాడులను అరికట్టాలంటే ప్రతి ఒక్కరూ కరాటే నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో జింకా పురుషోత్తం, కరాటే మాస్టర్ ఇనాయత్ బాషా పాల్గొన్నారు.

టోర్నీ విజేత ఓబులాపురం జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న నిర్వాహకులు

'యువగళం' క్రికెట్ టోర్నీ విజేత ఓబులాపురం

లేపాక్షి : కొండూరులో టిడిపి యువత ఆధ్వర్యంలో నిర్వహించిన 'యువగళం' పరిమిత ఓవర్ల క్రికెట్ టోర్నమెంట్ విజేతగా ఓబులాపురం జట్టు నిలిచినట్లు నిర్వాహకులు తెలిపారు. మండల పరిధిలోని కొండూరు గ్రామంలో టిడిపి నాయకులు పది రోజుల నుంచి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం జరిగిన ఫైనల్ పోటీ లో కొండూరు జట్టుపై ఓబులాపురం జట్టు విజయం సాధించింది. నియోజ కవర్గ టిడిపి సమన్వయకర్త శ్రీనివాసరావు, నాగరాజు, మండల కన్వీనర్ జయప్ప, మంగేష్, ఈడిగ రమేష్ ఆర్థిక సహాయంతో విజేత జట్టుకు ట్రోఫీ, రూ. 20 వేల నగదు, రన్నర్స్ జట్టుకు ట్రోఫీ, రూ.10వేల నగదు బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ జయప్ప, పట్టణ అధ్యక్షులు డిఈ రమేష్‌కు మార్, సర్పంచి సిద్ధార్థ, నాయకులు నాగరాజు, మంగేష్, రమేష్, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు, నిర్వాహకులు ధనుంజయ, జయరాం, శీనప్ప, వెంకటేష్, తిరుమలేష్, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి బస్సుయాత్రను జయప్రదం చేయండి

కనగానపల్లి : టిడిపి మినీ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి చేపట్టిన చైతన్యయాత్రను విజయవంతం చేయాలని మండల తెలుగు యువత అడుక్షుడు బట్టా సురేష్ చౌదరి ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. బస్సుయాత్ర సోమవారం(నేడు) రాప్తాడు నుంచి ప్రారంభమై మధ్యాహ్నం 12 గంటలకు స్థానిక నాలుగు రోడ్ల కూడలికి చేరుకుంటుందన్నారు. 2 గంటలకు తొగరకుంట హైస్కూల్ దగ్గరకు, 3 గంటలకు సోమరవాండ్లపల్లి రిజర్వాయర్ దగ్గరకు చేరుకుంటుందన్నారు. అక్కడ రిజర్వాయర్‌కు, అప్పర్ పెన్నార్ కాలువకు భూములు ఇచ్చిన రైతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. 4 గంటలకు రామగిరి మండలంలోని దుబ్బార్లపల్లి చేరుకుంటుందన్నారు. కావున టిడిపి నాయకులు, కార్యకర్తలు బస్సుయాత్రలో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

'భవిష్యత్తుకు గ్యారంటీ' యాత్ర వాయిదా

మడకశిర: 'భవిష్యత్తుకు గ్యారెంటీ' బస్సు యాత్రను నియోజకవర్గంలో వాయిదా వేసినట్లు టిడిపి పట్టణ అధ్యక్షుడు మనోహర్, మండల కన్వీనర్లు లక్ష్మీనారాయణ, కుమారస్వామి, దాసిరెడ్డి, గణేష్ తెలిపారు. పట్టణంలో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ అనివార్య కారణాల వల్ల బస్సు యాత్రను వాయిదా వేశారని, త్వరలో తేదీని ప్రకటిస్తామని తెలిపారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

హిందూపురం : వైసిపి ముఖ్య నాయకులు, 21వ వార్డు కౌన్సిలర్ మారుతిరెడ్డి జన్మదినం సందర్భంగా ఆదివారం స్థానిక ఆర్‌పిజిటి రోడ్డులో ఉన్న శ్రీవెంకటేశ్వర వృద్ధాశ్రమంలో అన్నదానం చేయడంతో పాటు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. అంతకుముందు తన నివాసంలో మారుతిరెడ్డి నాయకులు, స్నేహితుల సమక్షంలో కేక్ కోశారు. కార్యక్రమంలో అభిజిత్‌రెడ్డి, ప్రణయ్‌రెడ్డి, అమర్నాథ్‌రెడ్డి, ఇంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనాథ్, ప్రశాంత్, హఫీజ్, నంజుండరెడ్డి, గజేంద్ర, అశోక్, తరుణ్‌రెడ్డి, హితేష్, మురళి, తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి నాలెడ్జ్‌హబ్ భూములు రైతులకు ఇవ్వాల్సిందే

పుట్టపర్తి అర్బన్ : జిల్లాలోని లేపాక్షి నాలెడ్జ్ హబ్ భూములను తిరిగి రైతులకు ఇచ్చేవరకు పోరాటం చేస్తామని సిపిఐ రైతు సంఘం నాయకులు హెచ్చరించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం పార్టీ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ లేపాక్షి నాలెడ్జ్ హబ్ భూములను చౌకగా లాక్కొనేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఇప్పుడు జగన్ 20 వేల కోట్ల విలువ చేసే భూములను రూ. 500 కోట్లకు ఆయనకు కావాల్సిన వారికి కట్టబెట్టేందుకు ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. రైతులకు ఆ భూములను తిరిగి ఇవ్వాలని, లేని పక్షంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు. అలాగే జిల్లాలో అర్హులందరికీ ఇంటి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాటమయ్య, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అంజి, మధు, రమణ, గంగాధర్, జయలక్ష్మి, శ్రీరాములు, కుళ్లాయప్ప పాల్గొన్నారు.

మొరాయించిన ఆర్టీసీ బస్సు

మడకశిర : ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పిస్తున్నామని ఆర్టీసీ అధికారులు చెబుతున్నా ఆచరణలో చూపడం లేదని ప్రయాణికులు పేర్కొంటున్నారు. ఆదివారం ఉదయం పెను కొండ నుంచి మడకశిరకు వచ్చిన బస్సు స్థానిక అమరాపురం బస్టాండులో ఉన్నఫళంగా నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు బస్సును తోయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ మధ్యకాలంలో పెనుగొండ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులు ఎక్కడపడితే అక్కడ ఆగిపోతున్నాయి. కావున ఉన్నతాధికారులు స్పందించి కండిషన్‌లో ఉన్న బస్సులను నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

నిలిచిపోయిన బస్సును తోస్తున్న ప్రయాణికులు